సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 13 । జనవరి । 2023



పండుగకు వెళ్లండిలా..
సంక్రాంతికి ప్రజానీకం సొంతూళ్లకు వెళ్తున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టింది. - IIలో



మహనీయుడు వివేకానందుడు
దేశ ఔన్నత్యాన్ని చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. - IIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30°/14°
ఉదయం ఆకాశం పొగమంచుతో మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

18న యాదాద్రికి జాతీయ నేతలు

సాక్షి, యాదాద్రి: ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ సభకు వెళ్తూ వివిధ రాష్ట్రాల సీఎంలు, జాతీయ స్థాయి నేతలు, సీఎం కేసీఆర్ ఈ నెల 18న యాదాద్రికి రానున్నారు. ఢిల్లీ, పంజాబ్, కేరళ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, పినరయి విజయన్, యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తోపాటు మరికొంత మంది నాయకులు 17న హైదరాబాద్‌కు రానున్నారు. 18న ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లలో యాదగిరిగుట్టకు చేరుకుని శ్రీస్వామి వారి దర్శనం చేసుకుంటారు. యాదాద్రి ప్రధానాలయ ఉద్ఘాటనకు జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానిస్తామని గతంలో సీఎం ప్రకటించారు. అయితే అనివార్యకారణాల వల్ల అప్పట్లో జాతీయ స్థాయి నాయకులు ఎవరూ రాలేదు. ఇప్పుడు ఖమ్మం బీఆర్ఎస్ బహిరంగ సభ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో వస్తున్న జాతీయ నాయకులను యాదాద్రి సందర్శనకు తీసుకువస్తున్నారు. యాదాద్రిలో స్వామి దర్శనం అనంతరం ఖమ్మం బహిరంగ సభకు వెళ్లనున్నారు. అయితే, అధికారికంగా ఇంకా ఆదేశాలు రాలేదని దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

యూనిట్లు అమ్ముకోవద్దు



తిరుమలగిరిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈడీ శిరీష

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకం కింద ఇచ్చిన యూనిట్లను లబ్ధిదారులు అమ్ముకోవద్దని వాటి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష కోరారు. గురువారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో దళిత బంధు పథకం లబ్ధిదారుల యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెలు, గొర్రెలు వచ్చిన లబ్ధిదారులు వాటిని అమ్ముకోవద్దన్నారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, సిబ్బంది సంపత్, రాములుగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన చెవిటి వెంకన్న



రాష్ట్ర ఇన్‌చార్జ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన మాణిక్‌రావు ఠాక్రేను గురువారం గాంధీభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాక్షలు తెలిపారు.

సమరయోధులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న బొమ్మిడి లక్ష్మీనారాయణ

భానుపురి (సూర్యాపేట) : 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 16న కిరాణా మర్చంట్ అసోసియేషన్ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు, కార్యవర్గ సభ్యులతో పాటు, వివిధ నియోజకవర్గాల్లోని ఉద్యమకారులు సకాలంలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలకంఠ చలమంద, ప్రధాన కార్యదర్శి సీహెచ్ విశ్వేశ్వర రావు, కోశాధికారి నరేంద్రుని విద్యాసాగర్ రావు, గౌరవ సలహాదారులు ఎస్. ఏ. హమీద్ ఖాన్, కె. సంతోష్ రెడ్డి, కె. వెంకటయ్య, ఉన్నం సత్యనారాయణరావు, డి. కిషన్ నాయక్, దేవరశెట్టి నారాయణ, సాంబయ్య, చిత్రం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

● స్కూళ్లలో సంక్రాంతి



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం బ్రాంచ్ పాఠశాలలో గురువారం భోగిమంటలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు -కోదాడ అర్బన్

● పండుగ రద్దీ





సంక్రాంతి సందర్భంగా సెలవులు రావడంతో విద్యార్థులు తమసొంతూళ్లకు పయనమయ్యారు. ఇలా సూర్యాపేటలో బస్సెక్కేందుకు ప్రయాణికులు పోటీపడ్డారు. -సాక్షి, ఫొటోగ్రాఫర్ సూర్యాపేట

నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజలు చేపట్టారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్ర నామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఆయుష్మాన్ భవ!

ఆరోగ్య శ్రీ తరహాలో ఆయుష్మాన్ భారత్ పథకానికి శ్రీకారం

- దేశంలో ఎక్కడైనా రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం
- జిల్లాలో సుమారు 2.25 లక్షల మంది అర్హులు
- ఇంటింటికీ తిరిగి ఈ- కేవైసీ చేస్తున్న ఆరోగ్య మిత్రలు
- ఇప్పటి వరకు 5,400 మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు



వివరాలు సేకరిస్తున్న ఆరోగ్యమిత్ర

అర్వపల్లి : రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే ఈ పథకాన్ని కేంద్రం గతంలోనే ప్రవేశపెట్టినా ఇన్నాళ్లు రాష్ట్రంలో అమలు చేయలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో అర్హులైన నిరుపేదలకు వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. దారిద్య్రరేఖకు దిగువనున్న తెల్లరేషన్‌కార్డులు కలిగిన వారికి దేశవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా సేవలు అందేలా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 2.25లక్షల మందిని అర్హులుగా గుర్తించారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా దేశంలో ఎక్కడైనా రూ. 5లక్షల వరకు ఉచితవైద్యం పొందవచ్చు. లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఈ-కేవైసీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో దారిద్య్రరేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారు 2.25లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఆరోగ్యమిత్రలు పీఎంజేఏవై వెబ్‌సైట్‌లో లబ్ధిదారుడి ఆధార్ నంబర్ నమోదు చేయగానే వివరాలు వస్తున్నాయి. లబ్ధిదారుడి సెల్‌నంబర్, ఫుడ్‌సెక్యూరిటీ కార్డు నంబర్‌లు, అడ్రస్‌లు నమోదు చేయగానే సెల్‌కు ఓటీపీ నంబర్ వస్తుంది. ఈ నంబర్ ఆధారంగా వివరాలు నమోదు చేస్తున్నారు. సెల్‌నంబర్ అనుసంధానం లేకపోతే లబ్ధిదారుడి ఫొటో తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 5,400 మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గత నెల 23న ఈ కార్యక్రమం మొదలైంది. ఈ-కేవైసీ చేయడానికి వైద్య సిబ్బంది ముందుకు రాలేదు. దీంతో జిల్లాలోని 16 మంది ఆరోగ్యమిత్రలు ఇంటింటికీ తిరిగి ఈ-కేవైసీ చేస్తున్నారు.

ప్రయోజనాలు

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అమలుతో ఆరోగ్యశ్రీని పీఎంజేఏవైలో విలీనం చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు వైద్య సేవలందనున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇది వరకు రూ. 2లక్షల వరకు వైద్య ఖర్చులు వెచ్చించే వారు. కానీ ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ రాకతో వైద్య చికిత్సలకు కేంద్ర ప్రభుత్వం రూ. 5లక్షల వరకు అవకాశం కల్పించింది.

ఉచిత వైద్యం సంతోషకరం



ఆయుష్మాన్ భారత్ పథకంలో ఈకేవైసీ చేయించుకున్నాను. ఈ పథకం ద్వారా రూ.5లక్షల వరకు వైద్య చికిత్సలకు అవకాశం ఉండటం సంతోషకరం. మా ఇంటి వద్దకు వచ్చి ఈ-కేవైసీ చేశారు.

– బండి వెంకటేశ్వర్లు, లబ్ధిదారుడు, పానుగోడు, గరిడేపల్లి మండలం

ఇంటింటికీ వెళ్తున్నాం



ఆయుష్మాన్ భారత్ పథకం అమలు కోసం ఇంటింటికీ తిరిగి తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరి ఈ-కేవైసీ నమోదు చేస్తున్నాం. మా ఆరోగ్యశ్రీ డీఎం, టీం లీడర్‌ల ఆదేశాల మేరకు ఆరోగ్య మిత్రలం రోజూ 50 ఇళ్లకు వెళ్లి ఈ-కేవైసీ చేస్తున్నారు.

– ఎస్. రమేష్, ఆరోగ్యమిత్ర, సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రి

ఈ-కేవైసీ చేయించుకోవాలి



ఆయుష్మాన్ భారత్ పథకం కోసం తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యమిత్రల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఆరోగ్యమిత్రలు రాగానే ఫుడ్ సెక్యూరిటీ కార్డు, సెల్ నంబర్‌లు ఇవ్వాలి.

– ప్రమోద్ కొండపల్లి, డీఎం ఏబీ-పీఎంజేఏవై ఆరోగ్యశ్రీ

ఘనంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేసి త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి

- వేడుకలను ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : సుధా బ్యాంకు 23వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ లో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. మారుతి విద్యాసంస్థల విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రఖ్యాత శాస్త్రీయ సినీ సంగీత గాయకురాలు శ్రీనిధి వెంకటేష్ గాత్ర కచేరి నిర్వహించారు. అంతకుముందు సుధా బ్యాంక్ నుంచి త్రివేణి ఫంక్షన్ హాల్ వరకు త్యాగరాజ స్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, సుధా బ్యాంకు వైస్ చైర్మన్ నిర్మల, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా, వై .వెంకటేశ్వర్లు, గండూరి కృపాకర్, సూర్యాపేట వర్తక సంఘం అధ్యక్షుడు గండూరి శంకర్, సుధా బ్యాంకు డైరెక్టర్లు బోనగిరి భాస్కర్, అనంతుల ప్రభాకర్, శంకర్ లాల్, శ్రవణ్ కుమార్, మీలా సందీప్ కుమార్, చంద్రశేఖర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



గాత్ర కచేరి చేస్తున్న శ్రీనిధి వెంకటేష్



నృత్య ప్రదర్శన ఇస్తున్న మారుతి విద్యాసంస్థల విద్యార్థినులు

కంటి వెలుగుకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈ నెల 18 నుంచి చేపట్టే రెండో విడత కంటి వెలుగు శిబిరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. కంటి వెలుగుపై గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లాలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కంటి వెలుగు క్యాంపులు విజయవంతం అయ్యేందుకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఆర్‌పీలు, వీఓఏలను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. క్యాంపు నిర్వహణ ముందస్తు సమాచారం ప్రజలకు తెలియజేసి భారీ సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో క్యాంపుల నిర్వహణ కంటే ముందుగా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పర్యటించి షెడ్యూల్ వివరాలు తెలియజేస్తారని చెప్పారు. జిల్లాలో 53 బృందాల ద్వారా కంటి వెలుగు నిర్వహిస్తున్నామని, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి: గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 23 నుంచి 25 వరకు పట్టు పురుగుల పెంపకంపై నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాస్త్రవేత్త డాక్టర్ టి. మాధురి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆర్థిక సహకారంతో మూడు రోజుల ఉచిత శిక్షణ ఉంటుందని , భోజన, వసతి సదుపాయం కల్పిస్తారని ప్రయాణ ఖర్చులు ఇస్తారని ఆమె వివరించారు. పట్టు పురుగులు పెంచే రైతులు, ఆసక్తి కలిగిన గ్రామీణ యువత 35 మందికే శిక్షణకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గలవారు పేరు, గ్రామం, ఆధార్ కార్డు, విద్యార్హతలు, పూర్తి వివరాలతో గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9000906692లో సంప్రదించాలని ఆమె కోరారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



మట్టపల్లిలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రమ్యంగా రక్తికట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద మంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బడుగుల, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

సూర్యాపేటటౌన్ : స్వామి వివేకానంద ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచం దశదిశలా చాటిన వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. అలాగే స్వామి వివేకానంద ఉత్సవ కమిటీ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన యువతకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, వివేకానంద ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అంగిరేకుల నాగార్జున, డాక్టర్ కరుణాకర్, శ్యాంప్రసాద్, ప్రభాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

క్షయ బాధితులకు భరోసా

- 2,261 మందికి టీబీ నిర్ధారణ
- చికిత్స ద్వారా 13,00 మందికి విముక్తి
- ప్రతి నెలా రూ.1000 విలువ చేసే మందులు
- బలవర్ధక ఆహారం కోసం రూ.500 నగదు అందజేత



క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాగారం: క్షయ బాధితులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వ్యాధిబారిన పడినవారిని గుర్తించి చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు, బలవర్ధక ఆహారం కోసం రూ.500 అందిస్తోంది. క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ద్వారా ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా సంక్రమిస్తుంది. రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఇతరులకు వ్యాపిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల్లో ముఖ్యమైనది క్షయ. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపట్టాయి. దీనిలో భాగంగా జిల్లాలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి కేసుల సంఖ్యను గుర్తించారు. క్షయ వ్యాధి (టీబీ) జిల్లాలో నియంత్రణలోనే ఉంది. 2021 సంవత్సరంలో 1962 మంది రోగులను గుర్తించి చికిత్స అందించారు. 2022లో జనవరి–1 నుంచి డిసెంబర్ 31 నాటికి 15,223 మంది నమూనాలను పరీక్షించగా వీరిలో 2,261మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కాగా వీరిలో 1,300 మంది చికిత్స ద్వారా వ్యాధి నుంచి విముక్తి పొందారు. మిగితా 961మంది చికిత్స పొందుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 299మంది క్షయ వ్యాధి కేసులు పెరిగినా, గత ఏడాదికి ఈ సంవత్సరానికి జనాభా పెరిగిందని, ఈ పెరుగుదలతో పోల్చితే వ్యాధి నియంత్రణలోనే ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

అధికారుల ప్రత్యేక చర్యలు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో క్షయ రోగులు ఉన్నారు. ప్రధానంగా అనంతగిరి, సూర్యాపేట అర్బన్, చివ్వెంల మండలాల నుంచి ఎక్కువ కేసులు నమోదయ్యాయి. అలాగే ఆత్మకూర్(ఎస్), తిరుమలగిరి, నూతనకల్ మండలాల్లో తక్కువ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. టీబీ నివారణకు క్షయ నియంత్రణ విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ దగ్గుతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించారు. వారి నుంచి తెమడ నమూనాలను సేకరించి క్షయ నియంత్రణ విభాగానికి పంపించి పరీక్షలు నిర్వహించారు.

ఆరు నెలల్లో వ్యాధి నయం అయ్యేలా..

టీబీ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే చికిత్సలు అందిస్తున్నారు. ప్రతినెలా రూ.1000 విలువ చేసే మందులు ఇస్తున్నారు. ఆరు నెలల్లో పూర్తిగా వ్యాధి నయం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఆరు నెలల పాటు క్షయ బాధితులు మందులతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడానికి ప్రతి నెలా రూ.500 చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుంది. కొత్త కేసులు గుర్తించడానికి గతేడాది డిసెంబర్ –20 నుంచి జిల్లాలో 10 ప్రత్యేక బృందాలు ఇంటింటి సర్వేను చేపట్టి, కేసుల సంఖ్యను గుర్తించారు.

మెరుగైన చికిత్స అందిస్తున్నాం



క్షయ రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. పాజిటివ్ కేసుగా నమోదైన వెంటనే వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. బాధితుల్లో రోగ నిరోధక శక్తిని పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– జి.చంద్రశేఖర్, జిల్లా క్షయ నియంత్రణ విభాగం అధికారి, సూర్యాపేట.

ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్



కేతేపల్లి ఎస్సీ కాలనీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు

నకిరేకల్: పట్టణంలో నుంచి జాతీయ రహదారిపై పైకి వచ్చే చోట ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద జాతీయ రహదారి ప్రారంభంలో గడిచిన నాలుగేళ్లలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. సంక్రాంతి పండుగకు వెళ్తున్న వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఇక్కడ పోలీసులు ఎలాంటి ప్రమాద నివారణ చర్యలు చేపట్టలేదు. నకిరేకల్ నుంచి జాతీయ రహదారి మీదకు వచ్చే క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు అతివేగంతో వస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

కేతేపల్లి శివారులో మూడు స్పాట్‌లు..

కేతేపల్లి మండలంలో ఇనుపాముల నుంచి ఉప్పలపహాడ్ వరకు 13కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ మధ్యలో కొర్లపహాడ్, ఇనుపాముల, కేతేపల్లి ఎస్సీ కాలనీ జంక్షన్‌లను పోలీసులు యాక్సిడెండట్ స్పాట్‌లుగా గుర్తించారు. పండుగ రద్దీ నేపథ్యంలో ఈ మూడు చోట్ల పోలీసులు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి నిరంతరం పహారా కాస్తున్నారు. ఆయా జంక్షన్‌లకు అర కిలోమీటరు ముందే సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నార్కట్‌పల్లిలో నాలుగు చోట్ల..

నార్కట్‌పల్లి మండలంలో నాలుగు ప్రమాద స్పాట్‌లు గుర్తించారు. వివేర హోటల్, గోపలాయపల్లి, ఏపీ లింగోటం, నల్లగొండ పట్టణంలోకి వెళ్లే జంక్షన్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ నాలుగు చోట్ల పోలీసులు ట్రాఫిక్ నివారణ చర్యలు చేపట్టారు.

పండుగకు వెళ్లండిలా..

- సంక్రాంతికి హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్తున్న జనం
- 65వ నంబర్ జాతీయ రహదారిపై పెరిగిన వాహనాల రద్దీ
- హైవేపై పలు చోట్ల యాక్సిడెంట్ స్పాట్‌లు
- ఆచితూచి వెళ్లాలంటున్న పోలీసులు



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో విజయవాడ మార్గంలో బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఒకేసారి వేలాది వాహనాలు ఒకే వైపు వెళ్తుండడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అవుతుంది. వందల కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగిస్తున్న క్రమంలో ముందుచూపుతో వ్యవహరిస్తే సాఫీగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు.

ఫాస్టాగ్ చూసుకోకుంటే కష్టాలే

ఫాస్టాగ్ అమలులోకి వచ్చాక టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరే పరిస్థితి చాలా మేరకు తగ్గింది. కొద్ది మంది మినహాయిస్తే దాదాపు వాహనదారులంతా ఫాస్టాగ్ తీసుకున్నారు. ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోయినా, అకౌంట్ స్తంభించినా టోల్ ప్లాజాల వద్ద ఇబ్బంది తప్పదు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఇంటి నుంచి బయల్దేరే ముందే ఫాస్టాగ్‌ను చూసుకుంటే ఇబ్బందులు తలెత్తవు. లేదంటే టోల్‌ప్లాజాల వద్ద రెండింతల రుసుం చెల్లించాల్సి వస్తుంది. పంతంగి టోల్‌ప్లాజా మీదుగా సాధారణ రోజుల్లో ఇరువైపులా 30 నుంచి 40వేల వాహనాలు వెళ్తుంటాయి. సంక్రాంతి, దసరా పండుగల సమయంలో మాత్రం ప్రతిరోజు 50 నుంచి 60వేల వరకు వాహనాలు ఇరువైపులా రాకపోకలు సాగిస్తాయి.

10 టోల్ కౌంటర్లు విజయవాడ వైపే..

చౌటుప్పల్: పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. మొత్తం 16 కౌంటర్లకుగాను విజయవాడ మార్గంలోనే 10 టోల్ కౌంటర్లను ఓపెన్ చేశారు. మండలంలోని హైవేపై అన్ని గ్రామాల జంక్షన్‌ల వద్ద వాహనాల రద్దీ అధికంగా ఉంది. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆయా జంక్షన్‌ల వద్ద హైవే క్రాసింగ్ చేసే స్థానికులు ఆచితూచి వెళ్లాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

అదనపు సిబ్బందిని నియమించాం



సంక్రాంతిని దృష్టిలో ఉంచుకొని టోల్‌ప్లాజా వద్ద, హైవే వెంట అదనపు సిబ్బందిని నియమించాం. ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకుంటున్నాం. విజయవాడ మార్గంలో 10టోల్ కౌంటర్లు తెరిచాం. నిరంతరం పెట్రోలింగ్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయి. రెస్క్యూ టీంలను అందుబాటులో ఉంచాం. ఎలాంటి ఇబ్బంది ఉన్నా 1033 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. ఫాస్టాగ్ కోసం 6కౌంటర్లు ఏర్పాటు చేశాం.

– శ్రీధర్‌రెడ్డి, జీఎమ్మార్ టోల్‌ప్లాజా మేనేజర్, పంతంగి

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక అధికారులు



హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఎక్కడా ట్రాఫిక్ జాం కాకుడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక పోలీస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించాం. నిరంతరాయంగా 5 వాహనాల ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. హైవేపై జంక్షన్‌ల వద్ద వాహనాలు స్తంభించకుండా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. మల్కాపురం, తూప్రాన్‌పేట శివారుల్లో క్రేన్‌లను ఏర్పాటు చేశాం. 3అంబులెన్సులను అందుబాటులో ఉంచాం. పోలీస్, జీఎమ్మార్ సిబ్బందిని మూడు రెట్లకు పెంచాం. పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద జంక్షన్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నాం. ప్రతి రోజు రాత్రి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటారు.

– నూకల ఉదయ్‌రెడ్డి, ఏసీపీ, చౌటుప్పల్

10 యాక్సిడెంట్ స్పాట్‌లు



దుర్గాపురం వై జంక్షన్ వద్ద వాహనాల రద్దీ

కోదాడ: కోదాడ నియోజకవర్గ పరిధిలో మాధవరం, మొద్దులచెరువు స్టేజీ, తాడ్వాయి స్టేజీ, మునగాల సెంటర్, ముకుందాపురం, ఆకుపాములు, కొమరబండ వైజంక్షన్, కట్టకొమ్ముగూడెం క్రాసింగ్, దుర్గాపురం వైజంక్షన్‌ల వద్ద ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంది. గతంలో ఈ ప్రదేశాలలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి.

ఇక్కడ చాలా జాగ్రత్త అవసరం..

- మాధవరం వద్ద రోడ్డు మలుపుగా ఉండడంతో పాటు నేలమర్రి క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.
- మునగాల సమీపంలోని మొద్దుల చెరువు, త్వాడాయి క్రాసింగ్‌ల వద్ద రోడ్డు దాటేటప్పుడు ఆయా గ్రామాల ప్రజలు జాగ్రత్త వహించాలి.
- మునగాల మండల కేంద్రంలోని వైద్యశాల వద్ద ఉన్న క్రాసింగ్ ప్రమాదకరంగా ఉంది.
- మునగాల మండల పరిధిలోని ముకుందాపురం, ఆకుపాముల వద్ద ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంది. కొమరబండ వైజంక్షన్ నుంచి రాంగ్‌రూట్‌లో ఆకుపాముల వైపు నిత్యం వందల మంది ప్రయాణిస్తుంటారు. ఈ వారం రోజులు అక్కడ రాంగ్‌రూట్‌లో వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టాలి.
- కోదాడ పట్టణం లోపలికి వెళ్లే కొమరబండ వైజంక్షన్ వద్ద రోడ్డు క్రాసింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- కోదాడ బైపాస్‌లో కట్టకొమ్ముగూడెం క్రాసింగ్ రోడ్డు వద్ద గతంలో చాలా ప్రమాదాలు జరిగాయి. ఇక్కడ రోడ్డు దాటే వారు పద్మావతి కాలనీవాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- కోదాడ బైపాస్ చివరన దుర్గాపురం స్టేజీ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉండగా, ఇక్కడ క్రాసింగ్‌తో పాటు ఖమ్మం–జడ్చర్ల ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి.

నియంత్రణ చర్యలు చేపట్టాం



పండుగ రద్దీతో కోదాడ సబ్‌డివిజన్ పరిధిలోని మాదారం నుంచి రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు వరకు మొత్తం 10 చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించి తగు నియంత్రణ చర్యలు చేపట్టాం. మునగాల, కోదాడ టౌన్, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఇప్పటికే పికెట్‌లు ఏర్పాటు చేశాం. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామస్తులు ఎట్టి పరిస్థితుల్లో రాంగ్‌రూట్ ప్రయాణం చేయవద్దు. నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటాం

– వెంకటేశ్వరరెడ్డి, డీఎస్పీ, కోదాడ

చెక్ పాయింట్‌లు ఏర్పాటు



కట్టంగూర్: ప్రమాదాలు జరిగే నల్లగొండ క్రాస్‌రోడ్డు

కట్టంగూర్: మండల పరిధిలో జాతీయ రహదారి 14కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. పామనగుండ్ల, ఎరసానిగూడెం, మాణిక్యాలమ్మగూడెం, కట్టంగూర్‌లోని నల్లగొండ క్రాస్‌రోడ్డు, శ్రీకృష్ణనగర్, అయిటిపాముల గ్రామశివారులోని చెర్వుఅన్నారం బస్‌స్టాప్ సమీపంలో హైవేపై ఉన్న డివైడర్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా జీఎంఆర్ అధికారులు లైట్లు ఏర్పాటు చేశారు. ఎరసానిగూడెం స్టేజీ సమీపంలో బస్‌షెల్టర్ వద్ద పండుగ రద్దీ దృష్ట్యా పోలీసులు చెక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్ పాయింట్ వద్ద 24గంటలు విధులు నిర్వహించేలా ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ముగ్గురు పోలీసు సిబ్బందిని నియమించారు.

ఎరసానిగూడెం వద్ద చెక్ పాయింట్



సంక్రాంతి పండుగ సందర్భంగా హైవేపై ప్రమాదాలు చోటు చేసుకోకుండా మండలంలోని ఎరసానిగూడెం స్టేజీ వద్ద చెక్ పాయింట్ ఏర్పాటు చేశాం. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాల రద్దీ పెరిగింది. వాహనదారులకు సహకరించేందుకు నాతో పాటు ఏఎస్‌ఐ, ముగ్గురు పోలీసులు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నాం. హైవేపై ఉన్న డివైడర్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశాం.

– డి. విజయ్‌కుమార్, ఎస్‌ఐ, కట్టంగూర్

ప్రమాదాల నివారణకు స్టాపర్లు



చిట్యాలలో హైవే దాటేందుకు చూస్తున్న వాహనదారులు

చిట్యాల: చిట్యాల మండల పరిధిలో సుమారు 25కిలోమీటర్లకు పైగా ఉన్న హైవేపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. హైవేపై ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు జీఎమ్మార్ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హైవేపై క్రాసింగ్‌ల వద్ద, ప్రమాదాలు జరిగే చోట స్టాపర్‌లను ఏర్పాటు చేశా రు. ప్రమాదాలు జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1033కు కాల్ చేస్తే అంబులెన్స్ సౌకర్యంతో పాటు హైవేపై నిలిచిపోయిన వాహనాలను తరలించేందుకు క్రేన్ సౌకర్యం కల్పిస్తున్నారు.

ప్రమాదాలు జరిగేదిక్కడే..

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద, వెలిమినేడు గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద, వెలిమినేడు నుంచి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే క్రాసింగ్, పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడి సమీపంలోని క్రాసింగ్, చిట్యాల పట్టణంలోని బస్టాండ్, పోలీస్ స్టేషన్ ఎదురుగా క్రాసింగ్, రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి వద్ద, వట్టిమర్తి గ్రామ బస్‌స్టేజీ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీస్ శాఖ గుర్తించింది. దీంతో ఇక్కడ స్టాపర్‌లను ఏర్పాటు చేశారు.

ఇలా చేస్తే మేలు..

- హైవేపై ఏర్పాటు చేసిన స్పీడ్ లిమిట్‌కు అనుగుణంగా వేగంతో వాహనదారులు ప్రయాణిస్తే మేలు.
- హైవేపై దాబాల వద్ద ఆగి ఉన్న వాహనాలు ఒక్కసారిగా రోడ్డు మీదుకు వచ్చే ప్రమాదాలున్నాయి. కాబట్టి వాహనదారులు దాబా, హోటల్స్ వద్ద పరిశీలించి వెళ్లాలి.
- నిద్రలేమితో, మద్యం సేవించి ఉన్న వాహనాలు నడపరాదు.
- అనుభవజ్ఞులైన డ్రైవర్‌లను వాహనాల్లో తీసుకెళ్తే బాగుంటుంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సంక్రాంతి పండుగ వేళ హైవేపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో అతివేగంగా వాహనాలను నడుపుతుంటారు. చిట్యాల మండలం పరిధిలో బ్లాక్‌స్పాట్‌లు ఉన్న చోట హైవేపై ప్రమాదాలు జరగకుండా స్టాపర్‌లను ఏర్పాటు చేశాం.

– నకిరేకంటి ధర్మా, ఎస్‌ఐ, చిట్యాల

సైన్స్‌ఫేర్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు

మునగాల : నిర్మల్ జిల్లాలో ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో ఉపాధ్యాయుల విభాగంలో మునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్‌కే జాఫర్ జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈమేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయడు సీతారామరాజు తెలిపారు. గురువారం ఆయనను సన్మానించారు.



ఎస్‌కే జాఫర్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సీతారామరాజు

దేశ ఔన్నత్యాన్ని చాటిన వివేకానందుడు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటటౌన్, సూర్యాపేట క్రైం : దేశ ఔన్నత్యాన్ని చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గురువారం జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు మొదటి గురువని, వారు ఎప్పటికప్పుడు పిల్లల నడవడికను గమనించాలని తెలిపారు. యువజన దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన పాటలు, సాంస్కృతిక నృత్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేషులు, ఎస్‌ఐలు శ్రీనివాస్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడేది పండుగలే..

- జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్



డీఏవీ పాఠశాల మైదానంలో నిర్వహించిన భోగి వేడుకల్లో సీఈ మంగేష్‌కుమార్

నాగార్జునసాగర్ : పండుగలే భారతీయ సంస్కృతిని కాపాడుతూ వారసత్వంగా ముందు తరాలకు చేరుస్తున్నాయని నాగార్జునసాగర్ విద్యుదుత్పాదన కేంద్రం తెలంగాణ చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్ అన్నారు. గురువారం సాగర్‌లోని పైలాన్ కాలనీలో ఉన్న డీఏవీ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానమంతా రంగవళ్లులు, భోగి మంటలు వేసి, భోగిపండ్లు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలతో విద్యార్థులు అలరించారు. ఈ వేడుకలకు మంగేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయుల తో పాటు జెన్‌కో ఇంజనీర్లు పాల్గొన్నారు.

చేపల ప్యాకింగ్ పరిశీలన



చేపల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తల బృందం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చేపలను థర్మాకోల్ డబ్బాలలో ఐస్ ప్యాకింగ్ చేయడం ద్వారా 36గంటల వరకు తాజాగా ఉంటాయని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బి. లవకుమార్, సీహెచ్. నరేష్, డి. ఆదర్శ్ అన్నారు. గురువారం చింతలపాలెంలోని రేవల్లెలో చేపల ప్యాకింగ్, మార్కెటింగ్ అంశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేపలు పట్టిన తర్వాత వీలైనంత తక్కువ సమయంలో థర్మాకోల్ డబ్బాలలో ఐస్ వేసి వాటిని ప్యాక్ చేయడం ద్వారా వాటి నాణ్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. ఐస్ ప్యాకింగ్ చేయడం వల్ల చేపలను 28 నుంచి 36గంటల వరకు తాజాగా ఉంచవచ్చునని అన్నారు. శుభ్రమైన ఐస్‌తో కలిపి బాక్స్‌లో నింపి దూరప్రాంతాలకు సరఫరా చేయడం ద్వారా అధిక ధరను పొందవచ్చునని సూచించారు. చేపల పెంపకంపై ఆసక్తి గల రైతులకు కేవీకేలో శిక్షణ, అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్. వెంకటేశ్వర్లు, ఎ. బ్రహ్మానందం, బి. వెంకటేశ్వర్లు, మార్తమ్మ, ఎ. రామరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలు

- పెన్‌పహాడ్ మండలంలో 16మంది మేట్ల తొలగింపు
- రూ.1.30లక్షల రికవరీకి ఆదేశాలు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 2019 నవంబర్ నుంచి మార్చి 2022 వరకు రూ.18.80కోట్ల వ్యయంతో నిర్వహించిన ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి ఉపాధి హామీ బోర్డులు, రికార్డుల నిర్వహణ, పని ప్రదేశాల్లో ఫొటోలను అప్‌లోడ్ చేయకపోవడం, కొలతల్లో అవకతవకలు, పని చేయని వారి పేర్లను మస్టర్లలో రాయడం వంటి అక్రమాలకు పాల్పడడంతో గుర్తించిన అధికారులు రూ.1.30లక్షల రికవరీకి ఆదేశాలు జారీ చేయడంతో పాటు 16మంది మేట్లను తొలగించారు. గురువారం రాత్రి వరకు సామాజిక తనిఖీ కొనసాగింది. కార్యక్రమంలో ఏపీడీ పెంటయ్య, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, ఎస్సార్పీ రమేష్, అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, ఆశ, రవి, ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

■ ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ ద్వారా పార్ట్ టైం మరియు ఫుల్‌టైం వ్యాపార అవకాశం కలదు. వివరాలకు సంప్ర॥ మేనేజర్ : 9985944266 [Y-772727]

■ MS ASSOCIATES నందు పనిచేయుటకు సేల్స్ మరియు మార్కెటింగ్ రంగంలో అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఫుల్/పార్ట్ టైం అవకాశం కలదు. Salary & Allowances సంప్ర॥ 9550033682 [YA-2648]

Services

GOLD FINANCE

■ సంప్ర. సెల్: 79977 89771, బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. (100% జెన్యూన్) [B-798]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010422240, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509588 [G-776024]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వర్మీ కంపోస్ట్‌తో కాలుష్యం తగ్గించవచ్చు



వర్మీ కంపోస్ట్ విధానాన్ని వివరిస్తున్న కిరణ్

గరిడేపల్లి: వ్యవసాయంలో వర్మీ కంపోస్ట్ వాడకం వలన వాతావరణ, నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) మృత్తికా శాస్త్రవేత్త ఎ. కిరణ్ అన్నారు. గురువారం కేవీకేలో నేరేడుచర్ల జూనియర్ కళాశాలకు చెందిన ఒకేషనల్ విద్యార్థులకు వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వర్మీ షెడ్, వర్మీ బెడ్ నిర్మాణం, వానపాముల రకాలు, వర్మీ వాష్, వర్మీ కంపోస్ట్ తయారీ గురించి వివరించారు. పశువుల పేడ, కూరగాయల వ్యర్థాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ద్వారా లభించే వ్యర్థ పదార్థాలను ఉపయోగించి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసుకోవానే విధానాలను తెలియజేశారు.

సర్పంచ్ అర్ధనగ్న నిరసన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న వెంకటేశ్వరరావు

కేతేపల్లి: కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో తమ గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో అధికారులు సహకరించడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ గుర్తించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకునేందుకు వస్తే ఎంపీడీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కల్యాణలక్ష్మి దరఖాస్తులపై ధ్రువీకరణ కోసం సంతకాలు చేసేందుకు నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల తీరును నిరసిస్తూ అర్ధనగ్నంగా సభావేదిక ముందు బైఠాయించారు. కొద్దిసేపటి తర్వాత తోటి సభ్యులు, అధికారులు విజ్ఞప్తి మేరకు ఆయన ఆందోళన విరమించారు.

ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు చేయూత

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని శ్రీవాణి పాఠశాలలో గురువారం ఆ పాఠశాల అధినేత కొణతం సీతారాంరెడ్డి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు ఉపకేంద్రానికి పాఠశాలలో గదిని కేటాయించాలని కోరగా అందుకు ఆయన అంగీకరించి, ప్రారంభించడం అభినందనీయమని వైద్యాధికారిణి నాగిని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది కొణతం సీతారాంరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్యాంసుందర్‌రెడ్డి, జయమ్మ, సిబ్బంది జగన్, నర్సయ్య, రేణక, సునీత ఆశవర్కర్లు సీత, తులసి, పావణి, రజిత పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



లారీ కింద ఇరుక్కున్న బైక్

చివ్వెంల : అతివేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని తుల్జారావుపేట గ్రామ స్టేజీ వద్ద హైదరాబాద్– విజయవాడ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఓ బైక్‌ను లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

సమాజంలోని రుగ్మతలను ప్రశ్నించిన వ్యక్తి ప్రభాకర్

సూర్యాపేటటౌన్ : కలం, కుంచెతో సమాజంలోని రుగ్మతలను ప్రశ్నించిన యోధుడు అలిశెట్టి ప్రభాకర్ అని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో అలిశెట్టి ప్రభాకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రావు, ఎం.దశరథ రామారావు, యోగానంద్, ఆనంద్‌భాస్కర్, రమణ, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్, పరమేష్, దేవేందర్, సైదులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం



మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేంద్రకుమార్

తుంగతుర్తి : మండల పరిధిలోని అన్నారంలో ఉపసర్పంచ్‌పై వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం కోరం పూర్తిగా లేకపోవడంతో వీగిపోయిందని సూర్యాపేట ఆర్డీఓ రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం అన్నారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్‌పై వార్డుసభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా మొత్తం 12 మంది వార్డుసభ్యులకు ఏడుగురు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. దీంతో అవిశ్వాసం వీగిపోయిందని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ భీంసింగ్, ఎస్‌ఐ డానియేల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమే గెలుస్తుంది

తుంగతుర్తి : అధికార పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా న్యాయమే విజయం సాధిస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ అన్నారు. గురువారం అన్నారం గ్రామంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నారంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఉపసర్పంచ్‌పై అధికారి బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడం అధికార పార్టీకి చెంపపెట్టని అన్నారు. ఆయనతోపాటు సర్పంచ్ మిట్టగడ్పుల అనోక్, ఉపసర్పంచ్ ఉప్పుల నిర్మల, ప్రవీణ్‌రెడ్డి, దొంగరి లక్ష్మి, పిచ్చమ్మ, కేతమ్మ, రమేష్, ప్రభాకర్, యాదయ్య, చిరంజీవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

పెన్‌పహాడ్ : రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని జానారెడ్డి నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గ్రిష్మప్రియ రోడ్డు దాటుతుండగా పెన్‌పహాడ్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న గుర్తు తెలియని బైక్ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలికకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. చిన్నారి నాయనమ్మ భూక్య మాలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ నాగభూషణం

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ సోమ్‌నారాయణసింగ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్, ఏఎస్‌ఐ వెంకటరత్నం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18నుంచి కంటి వెలుగు

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 18 నుంచి చేపట్టనున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమంలో వైద్యసిబ్బంది చురుకుగా పాల్గొని ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని మండల వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 18న ఆత్మకూరు, ఏపూరు గ్రామాలనుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



భానుపురి : మినీ ట్యాంక్ బండ్‌పై ముగ్గులు వేస్తున్న మహిళలు



భానుపురి : బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



సూర్యాపేట రూరల్ : శాస్త్ర పాఠశాలలో సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ ఉప్పల లలితాదేవి ఆనంద్ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు, వంటల పోటీల కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ వి.వి.గురుమూర్తి, ఐపీసీలు సింగిరికొండ రవీందర్, గుండా శ్రీధర్, బండారు సత్యనారాయణ, తోట శ్యామ్‌ప్రసాద్, గుండా శ్రీదేవి, బిక్కుమళ్ల కృష్ణ, వీపీ లక్ష్మీనారాయణ, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బెలిదె శ్రీనివాసులు, కార్యదర్శి చల్లా లక్ష్మయ్య, ట్రెజరర్ భోనగిరి కృష్ణ, సోమా పద్మ, సంతోషి, గట్టు భవాని, కలకోట అనిత, పసుపర్తి జ్యోతి పాల్గొన్నారు.



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో..

తుంగతుర్తి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని డీఆర్ఆర్ఎం పాఠశాలతోపాటు, వెంపటి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రామనర్సమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లయ్య, జ్యోతి, రవీందర్, ఆంజనేయులు, నందన్‌కుమార్ పాల్గొన్నారు.

భానుపురి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక శ్రీ మారుతీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ మీలా మహదేవ్, ట్రస్టు సభ్యులు అనంతుల కృపాకర్, మీలా వాసుదేవ్, రాచర్ల కమలాకర్, కక్కిరేణి చంద్రశేఖర్, శర్మ, పాఠశాల ఇన్‌చార్జ్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత పాల్గొన్నారు.

మద్దిరాల : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చిన్ననెమిల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివయ్య, ఎస్ఎంసీ చైర్మన్ అనంతుల వెంకన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హర్షున్, ఉపేందర్‌రెడ్డి, యాకయ్య, ప్రదీప్‌కుమార్, సాల్మన్, ఉపేందర్, అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో, అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలల్లో గురువారం ముందస్తుగా సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. తిమ్మాపురం పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు ఈ నెల 26న రిపబ్లిక్‌డే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం చాంప్లా తెలిపారు. అలాగే అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు, మదర్స్‌డే జరిపారు. ఆయా కార్యక్రమాల్లో మాంటిస్సోరి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్కూల్స్ కరస్పాండెంట్ విపిన్‌కుమార్, హెచ్ఎం మను, ఉపాధ్యాయులు స్నేహలత, కృష్ణయ్య, కొండ వెంకన్న, ఎస్. వెంకన్న, మాధవి, సునంద, పీఈటీ సైదులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట పట్టణ పరిధిలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో ఉన్న శాస్త్ర పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జెడ్పీటీసీ జీడి భిక్షం పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎడ్ల గంగాభవాని, పాఠశాల చైర్మన్ ఎం. చంద్రశేఖర్, డైరెక్టర్లు కరుణారావు, పుష్పలత పాల్గొన్నారు.

నాగారం : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ చిపలపల్లి మల్లేష్ మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, రవీనా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : డీఆర్ఆర్ఎం పాఠశాలలో ముగ్గుల పోటీలు..



నూతనకల్ : నాగార్జున ఉన్నత పాఠశాలలో..



అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో..



భానుపురి : మారుతీ విద్యానికేతన్ పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



నాగారం ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు..



మద్దిరాల : చిన్ననెమిల ప్రభుత్వ పాఠశాలలో..

వేతనం అందజేత

నాగారం : మండల కేంద్రంలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో ఎస్-ఫౌండేషన్ ద్వారా నియమించబడిన విద్యావలంటీర్‌కు వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల గురువారం మూడు నెలల వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వి.మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, రవీనా పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



నూతనకల్ : క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి

నూతనకల్ : భయ్యా సన్ని యాదవ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు గురువారం మండల కేంద్రంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి మాట్లాడారు. క్రీడాదుస్తులు పంపిణీ చేసిన క్లబ్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భయ్యా రవీందర్, భయ్యా కళ్యాణ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ కిట్ అందజేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేటటౌన్ : యువత క్రీడల్లో రాణించాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో యువ క్రీడాకారులకు క్రికెట్ కిట్టును తన సొంత ఖర్చుతో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, సాలయ్య, వెంకటేష్, నవీన్, గణేష్, నాగార్జున, నవీన్, వీరు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సంకినేని పరామర్శ

పెన్‌పహాడ్ : అనాజిపురం గ్రామానికి చెందిన చెన్ను కోటమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు గురువారం సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పోకల రాములు, చెన్ను రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జెల వెంకటరెడ్డి, సలిగంటి వీరేంద్ర, పల్సా మల్సూర్, చెన్న శిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు రావాలని మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న అర్చకుడు

భానుపురి : జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 14న నిర్వహించే శ్రీ గోదా శ్రీనివాస కల్యాణ మహోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, నిర్వాహకులు గురువారం మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందించారు. మంత్రిని కలిసిన వారిలో బజ్జూరి కృష్ణయ్య, గజ్జల రవీందర్, కరుణాసాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామీణులకు చట్టాలపై అవగాహన కల్పించాలి

అర్వపల్లి : గ్రామీణప్రాంత ప్రజలకు న్యాయవాదులు చట్టాలపై ఎప్పటికప్పుడు తగిన అవగాహన కల్పించాలని రాష్ట్ర హైకోర్టు సీనియర్ కౌన్సిల్ బి. రచనారెడ్డి కోరారు. గురువారం అర్వపల్లిలో రచనారెడ్డి అండ్ అసోసియేట్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, న్యాయవాదులు ఆర్. ఫూల్‌సింగ్‌నాయక్, కారింగుల వెంకటేశ్వర్లు, చీదరి సురేష్, అనిల్‌కుమార్‌యాదవ్, ఎస్‌కే. వజీర్, మర్రిపల్లి సురేష్, చింత నర్సింహ, దిర్శనపు కృష్ణమూర్తి, భీముడు, ఇమ్మడి సోమయ్య, లింగస్వామి, వెంకట్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రచనారెడ్డి

బీజేపీ ఆధ్వర్యంలో సన్మానం..

అర్వపల్లికి వచ్చిన హైకోర్టు సీనియర్ కౌన్సిల్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనారెడ్డిని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఆపార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాక వీరేష్‌యాదవ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అంగోతు శ్రీనివాస్ నాయక్, కూర శంకర్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

తిరుమలగిరి : డీటీఎఫ్ 2023–24 క్యాలెండర్, డైరీలను గురువారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆనంద భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జి.నరేష్, వెంకటేశ్వర్లు, హమాలీ సంఘం అధ్యక్షుడు రామచంద్రు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఆ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సీహెచ్. వెంకటేశ్వర్లు, పబ్బతి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు నామా వీరయ్య, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ జిల్లా అధ్యక్షుడు చామకూరి మహేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్, తహసీల్దార్ శేషగిరిరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి సేన పరిషత్ గౌరవ సలహాదారులు గుండు లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు బంటు సందీప్, మండల అధ్యక్షుడు యరకల రాకేష్, నాయకులు బంటు శివ, మామిడి వెంగయ్య, బొల్లక మహేష్, కొమరజు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి : భవన నిర్మాణ కార్మిక సంఘం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల మల్లయ్య, ఎలుక సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

నాగారం : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ఆయిల్ పామ్ కంపెనీ తుంగతుర్తి డివిజన్ క్షేత్రస్థాయి అధికారి వి.శశికుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేర్పుల సాలయ్య, ఆయిల్ పామ్ కంపెనీ తుంగతుర్తి డివిజన్ క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, రైతులు శ్రీను, వెంకన్న, కృష్ణమూర్తి, వెంకటేష్, కొమరయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



పసునూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శశికుమార్

సమాజ నిర్మాణంలో యువత ముందుండాలి



తుంగతుర్తిలో రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్



దురాజ్‌పల్లి : స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మద్దిరాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ నాగార్జునగౌడ్

తుంగతుర్తి : సమాజ నిర్మాణంలో యువత ముందుండాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం రక్తదాన శిబిరంలో 80 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తుంగతుర్తి సీఐ నాగార్జున, ఎస్‌ఐలు డానియేల్‌కుమార్, వెంకన్న, ప్రసాద్, శివకుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పుల్లయ్య, గణేష్, నాగయ్య, ప్రమీల, భగత్‌సింగ్, మధూకర్, రాంబాబు, ప్రదీప్ దయాకర్, వసంత, శోభారాణి, సంతోష్, సోని, రాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : స్వామి వివేకానంద జయంతి వేడుకలను తిరుమలగిరిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, మహేష్, ప్రకాష్‌యాదవ్, ఉపేంద్రాచారి, గణేష్, అశోక్, లింగయ్య, ఉపేందర్, వెంకటేష్, పరశురామ్, నగేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రంగౌడ్, ఐతె శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, కాలియా పాల్గొన్నారు.

నాగారం : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎం.రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కె.రమేష్, కె.కార్తీక్, భూతం యాకమల్లు, రాజేందర్, మానసవీణ, కర్ణాకర్, గణేష్, సెరినా, రోజా, హెచ్ఎం వి.మల్లయ్య, వెంకటమల్లు, వీరేష్, రవీనా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అబీద్, జిల్లా నాయకులు సలిగంటి వీరేంద్ర, గజ్జల వెంకటరెడ్డి, చల్లమల్ల నరసింహ, పలస మల్సూర్ గౌడ్, మీర్ అక్బర్, వల్దాస్ ఉపేందర్, బల్గూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాలలో రక్తదాన శిబిరం..

మద్దిరాల : మండల పరిధిలో జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదానం చేసిన యువతకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్న, ప్రసాద్, సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బహిరంగ సభను విజయవంతం చేయాలి

నూతనకల్ : ఈ నెల 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, చూడి లింగారెడ్డి, పన్నాల సైదిరెడ్డి, తాడూరి లింగయ్య, సజ్జనాయక్, తాడూరి సైదులు, బత్తుల సురేష్ పాల్గొన్నారు.

డైనింగ్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

మద్దిరాల : మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చిన్ననెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి హెచ్ఎం శివయ్య, ఎస్ఎంసీ చైర్మన్ అనంతుల వెంకన్న గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హర్షున్, ఉపేందర్‌రెడ్డి, యాకయ్య, సాల్మన్, ప్రదీప్‌కుమార్, ఉపేందర్, అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం..

నూతనకల్ : మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు పెద్దింటి రంగారెడ్డి మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కార్యాలయ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేసోజు మధు, మున్నా అశోక్, బిక్కి ప్రవీణ్, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, కూసు వెంకన్న, పంతం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

అర్వపల్లి : మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై చర్చించారు. ఈ సర్వసభ్య సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఈఓ బాలునాయక్, ఏఓ శిధర్‌రెడ్డి, ఎంపీఓ సందీప్‌కుమార్, ఏపీఎం మల్లేష్, డీఈఈ పిచ్చయ్య, ఏఈఈలు వి. శ్రీకాంత్, అశోక్, మహేష్, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరాజు, డాక్టర్ బి.అర్జున్ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

పెన్‌పహాడ్ : మాచారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాలయానికి మాచారం ఆవాసం అనిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం సతీమణి దేవిరెడ్డి నారాయణమ్మ, కుమారుడు, కుమార్తెలు గురువారం రూ.5లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ బొల్లక బొబ్బయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి మాధవరెడ్డి, చైతన్యరెడ్డి, నిర్మతిరవీందర్‌రెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి, బొల్లక సాదయ్య, బొల్లక సోమయ్య, దేవయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

అర్వపల్లి : కోడూరు గ్రామానికి చెందిన చెంచెల నిర్మలకు మంజూరైన రూ.31,500 సీఎం సహాయ నిధి చెక్కును గురువారం బీజేపీ నాయకులు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫార్సు మేరకు సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబ, కూర శంకర్, పగడాల భిక్షంరెడ్డి, జిన్నె అశ్విన్ కుమార్, చెంచెల శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు

అర్వపల్లి : బడి ఈడు పిల్లలంతా బడుల్లో చేరాలని జాజిరెడ్డిగూడెం కాంప్లెక్స్ సీఆర్పీ జానయ్య కోరారు. గురువారం సీతారాంపురం, జాజిరెడ్డిగూడెం, తుంగగూడెం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బడి బయట ఉన్న పిల్లల వివరాలు సేకరించారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని ఇటుకబట్టీల వద్ద బడికి వెళ్లని చిన్నారులను గుర్తించినట్లు సీఆర్పీ శ్రీనివాస్ గురువారం తెలిపారు.



మద్దిరాలలో ఇటుకబట్టీల వద్ద ఉన్న చిన్నారులు